క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి 4 సంవత్సరాల ఆనర్స్ డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కళాశాలకు సైన్స్‌లో 3, ఆర్ట్స్ విభాగంలో 1 సబ్జెక్టు నందు ఆనర్స్ డిగ్రీ కోర్సుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. మ్యాథమ్యాటిక్స్, జువాలజీ, కెమిస్ట్రీ కోర్సుల్లోను, ఎకనామిక్స్‌లో 4వ సంవత్సరం ప్రవేశాలు పొందవచ్చన్నారు. 2020–23 బ్యాచ్‌లో డిగ్రీ పూర్తి చేసి 75 శాతం ఉత్తీర్ణత పొందిన మహిళా అభ్యర్థినులు ఈ కోర్సులో ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఈ 4 సంవత్సరాల డిగ్రీ ఆనర్స్ పూర్తి చేసినవారు పీజీలో నేరుగా రెండో సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ గురివిరెడ్డి, ప్రవేశాల కోఆర్డినేటర్ ఆనంద్‌కుమార్‌రెడ్డిని కలిసి ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

కడప కోటిరెడ్డిసర్కిల్ : నగరంలోని కో ఆపరేటివ్ కాలనీలో సాయి మానస డెంటల్ అండ్ మ్యాక్సిల్‌లో ఫేషియల్ ఆస్పత్రిలో గురువారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వీఆర్ ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో డాక్టర్ ఉజ్వలారెడ్డి మాట్లాడుతూ శిబిరానికి వచ్చిన వారికి రూ. 1000 విలువజేసే మందులను వీఆర్ ఫౌండేషన్ ట్రస్టు అందించడం అభినందనీయమన్నారు. సెప్టెంబరు 4వ తేదీ వరకు శిబిరం ఇలాగే కొనసాగుతుందని, ముఖంపై మచ్చలు, మంగు, మొటిమలు, కంటి కింద చారలు, వెంట్రుకలు రాలడం, చుండ్రు తదితర సమస్యలతో బాధపడేవారు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీఆర్ ఫౌండేషన్ ట్రస్టు చైర్మన్ దాదిరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ శిబిరాలు సెప్టెంబరు 4వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 9 గంటల వరకు కొనసాగుతుందన్నారు. వివరాలకు 90972 18999 సంప్రదించాలన్నారు.

రోడ్డుపై మురికి నీటితో ఇబ్బందులు



ఆర్టీసీ అవుట్ గేట్ వద్ద రోడ్డుపై నిలిచిన మురికి నీరు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ బస్టాండు అవుట్ గేట్ సమీపంలో రోడ్డుపైన నీళ్లు నిలబడ్డాయి. అవి వర్షపు నీరు అనుకుంటే పొరపాటే. డ్రైనేజీ పొంగి రోడ్డుపై మురికి నీరు ప్రవహిస్తూ దుర్వాసన వెదజల్లుతోంది. ఈ రహదారిలో బస్సులతోపాటు ఆటోలు, బైకులు, కార్లు ప్రతి నిత్యం రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

కడప అర్బన్: కడప నగర శివార్లలోని రిమ్స్ పీఎస్ పరిధిలో వున్న రౌడీషీటర్లకు ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి గురువారం రాత్రి పోలీస్‌స్టేషన్ ఆవరణంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ రౌడీషీటర్లందరూ సత్ప్రవర్తనతో వుండాలనీ, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జీతాలు చెల్లించాలి



జిల్లా ఉప ఖజాన అధికారి వెంకటేశ్వర్లుకు వినతిపత్రాన్ని ఇస్తున్న యూటీఎఫ్ నేతలు

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో ఇటీవల బదిలీలు, పదోన్నతులపై వెళ్లిన ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలను చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం సాయంత్రం జిల్లా ఉప ఖజాన అధికారి వెంకటేశ్వర్లుకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు నెలలుగా జీతాలు అందక ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు నరసింహారావు, నాగరాజు, గోపీనాథ్, కరీముల్లా, కిరణ్‌బాబు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

హాకీ ఆస్ట్రో టర్ఫ్ ఏర్పాటుకు వినతి

కడప స్పోర్ట్స్: కడప నగరంలో హాకీ క్రీడకు సంబంధించి ఆస్ట్రో టర్ఫ్‌ను ఏర్పాటు చేయాలని ధ్యాన్‌చంద్ హాకీ అకాడమీ డైరెక్టర్ ఎస్. సుభాన్‌బాషా కోరారు. గురువారం శాప్ ఎండీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ధ్యాన్‌చంద్రను ఆయన కలిసి విన్నవించారు. క్రీడాసంఘాల ఎన్నికలు సజావుగా నిర్వహించాలని కోరినట్లు ఆయన తెలిపారు.

ఆలయాలలో పౌర్ణమి పూజలు



శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంలో నక్షత్ర, కుంభ హారతి సమర్పిస్తున్న అర్చకుడు



విశేష అలంకారంలో శ్రీ విజయదుర్గమ్మ

కడప కల్చరల్ : శ్రావణపౌర్ణమిని పురస్కరించుకుని కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంలో సామూహికంగా సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు విజయ్ భట్టర్ భగవత్ విజ్ఞాపనం, మహాసంకల్పం, నవ కలశ స్నపన తిరుమంజనం, తోమాల సేవ, సహస్ర నామార్చన నిర్వహించారు. భక్తులందరికి సత్యనారాయణస్వామి వ్రతం చేస్తే కలిగే ఫలాల గురించిన ఉదాహరణతో కథలు వినిపించారు. అనంతరం మహా నివేదన చేసి దేవతామూర్తులకు నక్షత్ర, కుంభ హారతి సమర్పించారు. భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దుర్గమ్మ సన్నిధిలో..

శ్రావణ పౌర్ణమి సందర్భంగా గురువారం కడప నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి పౌర్ణమి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం వేద పండితులు ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్, కుటుంబ సభ్యులు, ఇతర భక్తులు వివిధ పుణ్య నదీజలాలు నింపిన కలశాలతో మంగళ వాయిద్యాల మధ్య ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. ఆ జలాలతో అమ్మవారి మూలమూర్తికి నవకలశ స్నపనం నిర్వహించారు. కనుల పండువగా అలంకరించారు. యాగశాలలో వేద పండితులు చండీ హోమం చేశారు. ఆలయ ప్రాంగణంలో 108 మంది ముత్తయిదువులతో అష్టోత్తర శతకలశ దీపాలంకార సేవలు చేశారు. రాత్రి అమ్మవారికి పల్లకీ సేవ, పవళింపు సేవలు నిర్వహించారు.

మరియ తల్లి మార్గం ఆదర్శనీయం



దైవ సందేశం అందజేస్తున్న క్రైస్తవ గురువు

కడప కల్చరల్ : మరియ తల్లి మనకెంతో ఆదర్శనీయమని, ఆ తల్లి నుండి మనం అనేక విషయాలను నేర్చుకోవాలని, రామకుప్పం విచారణ గురువులు రెవ ఫాదర్ చిన్నప్ప రాయర్ అన్నారు. కడప నగరం రైల్వే స్టేషన్ సమీపంలోని ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో నవ దిన ఉత్సవాలను పురస్కరించుకుని మూడవరోజు గురువారం ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.

- పలమనేరు విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ జయపాల్ దివ్యబలి పూజను సమర్పించగా, చిన్నప్ప రాయల్ మరియమాత సందేశాన్ని వినిపించారు. మరియ తల్లి క్రీస్తు ప్రభువుకు అత్యంత సన్నిహితమైనదిగా, ప్రథమ శిష్యురాలిగా ఆయన వెంట నడిచినదని, క్రీస్తు ప్రభువుకు జన్మనిచ్చిన తల్లే ఆయన అడుగుజాడల్లో నడిచిందని, మనం కూడా మరియ తల్లి లాగా క్రీస్తు బాటలో పయనించాలని ఆయన సూచించారు. కార్యక్రమ ప్రారంభంలో మరియమాత స్వరూపాన్ని కనుల పండువగా అలంకరించి పల్లకీపై ఏర్పాటు చేశారు. భక్తిగీతాలను ఆలపిస్తూ ఆ క్షేత్రంలో ఊరేగింపు నిర్వహించి ప్రధాన వేదిక వద్దకు తెచ్చి ప్రతిష్ఠించారు. పాటలు, తేరు అలంకరణ, దివ్యబలి పీఠం అలంకరణ పలమనేరు డీస్ బృందం నిర్వహించారు.
- దివ్యపూజ బలిపూజ అనంతరం పూజను, సందేశాన్ని అందించిన గురువులను శాలువా, పూలమాల, పుష్పగుచ్ఛం, శాంతి సేవా సొసైటీ జ్ఞాపికతో మెమెంటో, అరులయ్య కరుణయ్య పుస్తకంతో వారిని కమిటీ సభ్యులు సత్కరించారు. విశ్వాసులకు భోజన సౌకర్యం కల్పించారు.
- ఈ కార్యక్రమంలో పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ ఎం డి ప్రసాదరావు, సహాయ డైరెక్టర్ ఫాదర్ విల్సన్ ఆరోగ్యమాత అమ్మగార్లు మరియాపురం పెద్ద చర్చి విచారణ గురువులు రెవ ఫాదర్ బిరుసు రాజా, బిషప్ సెక్రటరీలు, ఫాదర్ లూర్దు, ఫాదర్ చైతన్య, ఫాదర్ ప్రకాష్ రెడ్డి ఫాదర్ అనిల్, డాన్ బోస్కో గురువులు రెవ ఫాదర్ జార్జ్, చర్చి యువకులు తదితరులు పాల్గొన్నారు.

సోదరి, సోదరుల ప్రేమకు ప్రతీక 'రక్షా బంధన్'



డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు రాఖీలు కడుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు

కడప కార్పొరేషన్ : అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల ప్రేమకు 'రక్షా బంధన్' ప్రతీక అని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. గురువారం రాఖీ పౌర్ణమి సందర్భంగా వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు డిప్యూటీ సీఎంకు రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఎంతో గౌరవం ఇస్తుందన్నారు. జగనన్న ప్రభుత్వంలో మహిళలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి పథకాలన్నీ వారి పేరుతోనే ఇవ్వడం జరుగుతోందన్నారు. అన్ని పదవుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ ఇచ్చారన్నారు. ఇంత మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నేతలు రత్నకుమారి, క్రిష్ణవేణి, టీపీ వెంకట సుబ్బమ్మ, మూలే సరస్వతి, బండి మరియలు, నారాయణమ్మ, పద్మ, తులశమ్మ, సుశీలమ్మ, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చెరువులను పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దాలి



చెరువులను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్, ఆర్‌డీఓ ధర్మ చంద్రారెడ్డి

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని బుడ్డాయపల్లె, ఫక్కీరుపల్లె, ఊటుకూరు చెరువులను అభివృద్ధి చేసి, పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. గురువారం ఆర్‌డీఓ ధర్మచంద్రారెడ్డి, కడప తహసీల్దార్ శివరామిరెడ్డిలతో కలిసి ఆయా చెరువులను పరిశీలించారు. బుడ్డాయపల్లె చెరువు 73 ఎకరాల్లో విస్తరించి ఉందని, దాని చుట్టూ బండ్ ఏర్పాటు చేసి, మొక్కలు నాటాలన్నారు. ముందుభాగాన ప్లాజా, ఓపెన్ జిమ్, పార్కు ఏర్పాటు చేయాలన్నారు. చెరువు మధ్య భాగంలో ఐలాండ్ ఏర్పాటు చేయాలన్నారు. ఫక్కీరుపల్లె చెరువు 76 ఎకరాల్లో విస్తరించి ఉందని, దాని చుట్టూ బండ్, వాకింగ్ ట్రాక్, పార్కు ఏర్పాటు చేయాలన్నారు. 37 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఊటుకూరు చెరువు చుట్టూ బండ్ ఏర్పాటు చేసి మెయిన్ రోడ్డుకు దగ్గరగా ఎంట్రెన్స్ ప్లాజా, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలన్నారు. చెమ్ముమియ్యాపేట పాఠశాల ఎదుట గ్రీనరీ కొరకు ఏర్పాటు చేసిన స్థలంలో మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తమ లక్ష్యమని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సీఎల్పీ నాయకుడు మల్లు బట్టి విక్రమార్క పేర్కొన్నారు. గురువారం పీపుల్స్ మార్చ్ పాదయాత్ర తెలంగాణలో విజయవంతంగా పూర్తి చేసుకొని ఇడుపులపాయ వెళ్తు మార్గమధ్యంలో కడపకు విచ్చేసిన మల్లు బట్టి విక్రమార్కకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కడప నగరంలోని అలంఖాన్ పల్లె సర్కిల్ వద్ద స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు రోజుల్లో దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం రాహుల్ గాంధీ ప్రధాని అవ్వడం తథ్యమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఏఐసీసీ మెంబర్ బండి జకరయ్య, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుమల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నరసింహారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ఆన్‌లైన్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని చిన్నచౌక్ సీఐ నరసింహారెడ్డి సూచించారు. గురువారం కడప ఎన్‌జీవోకాలనీలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాల పట్ల అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్‌కు మిస్డ్ కాల్, లక్కీలో గెలుపొందారంట, క్షణాల్లో డబ్బులు ఇస్తామంటూ, ఫోన్‌కు ఫుల్ రీచార్జ్ చేస్తామంటూ వస్తున్న వాటిని నమ్మి మోసపోరాదని అన్నారు. ఇవన్నీ మనవద్ద నుంచి డబ్బులు దోచుకునేందుకేనన్న విషయాన్ని గుర్తించాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే వ్యక్తిగత సమాచారాన్ని ఇవ్వవద్దన్నారు. విద్యార్థులు హెల్మెట్ లేకుండా బైకులను నడపరాదన్నారు. అలాగే కళాశాలల్లో ఎవరు కూడా ర్యాగింగ్‌కు పాల్పడ కూడదన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. కొత్త వ్యక్తుల పరిచయాలు పనికిరావని, ఎవరి పట్లైనా అనుమానం ఉంటే పోలీసులకు తెలియచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రవికుమార్, కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు, ఏఓ మల్లికార్జునస్వామి, వైస్ ప్రిన్సిపాల్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక శాస్త్రాలకు నెలవు సంస్కృతం

వైవీయూ : అంతరిక్ష విజ్ఞానం, వైమానిక విజ్ఞానం వంటి అనేక వైజ్ఞానిక అంశాలకు నెలవు సంస్కృత భాష అని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డా. చింతకుంట శివారెడ్డి పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో అంతర్జాతీయ సంస్కృత దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా విచ్చేసిన ఆయన హయగ్రీవ జయంతి విశిష్టతను, జన్మరహస్యాన్ని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ అనేక సాహిత్య చరిత్రలకు పునాది సంస్కృతమన్నారు. కార్యక్రమంలో సంస్కృతశాఖ విభాగాధిపతి డా. టి. వెంకటేశ్వర్లు, డా. విశ్వనాథ్, డా. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శాంతమ్మ సేవలు మరువలేనివి



కమ్యూనిస్ట్ ఉద్యమ నేత శాంతమ్మ స్తూపావిష్కరణలో సీపీఐ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కమ్యూనిస్ట్ ఉద్యమ నాయకురాలు కర్నాటి శాంతమ్మ పార్టీకి చేసిన సేవలు మరువలేనివని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే. రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం నగరంలోని అలంఖాన్ పల్లెలో కమ్యూనిస్ట్ ఉద్యమ నేత సీపీఐ నాయకురాలు శాంతమ్మ స్తూపావిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతమ్మ ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నాయకురాలుగా మహిళల సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి ఓబులేసు, జి ఈశ్వరయ్య, ఏపీ మహిళ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గా భవాని, సీపీఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర , ఏపీ ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు చంద్రా నాయక్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కడప కోటిరెడ్డి సర్కిల్ : కేంద్ర ప్రభుత్వ సామాజిక భద్రతా పథకాలైన ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్ తెలిపారు. గురువారం ఏపీజీబీ ప్రధాన కార్యాలయంలో పథకాలకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజనకు 18–70 సంవత్సరాల వయస్సుగల వారు సంవత్సరానికి రూ. 20 చెల్లించాలని, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి పథకానికి 18–50 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి సంవత్సరానికి రూ. 436 ప్రీమియం చెల్లించాలన్నారు. అటల్ పెన్షన్ యోజనకు 18–40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు.

ఈ అవకాశాన్ని ఖాతాదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంకు సీజీఎం సందీప్ జె గావరె, నాబార్డు జీఎం డాక్టర్ కేవీఎస్ ప్రసాద్, జీఎం జగదీశ్వరరావు, కె.రవివర్మ, ఆర్‌బీఐ ఏజీఎం ఎంఎస్ రూప తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు అందిపుచ్చుకోవాలి



శిక్షణ పూర్తిచేసుకున్న సిబ్బందితో వీసీ ఆచార్య చింతా సుధాకర్, ప్రిన్సిపాల్

వైవీయూ : పోటీ ప్రపంచానికి తగ్గట్టుగా సిబ్బంది నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. గురువారం విశ్వవిద్యాలయంలోని బోధనేతర సిబ్బందికి నిర్వహించిన కంప్యూటర్ ప్రొఫిషియన్సీ స్కిల్ ట్రెనింగ్ ప్రోగ్రాం ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ మాట్లాడుతూ సిబ్బంది ఎప్పటికప్పుడు నూతన అంశాలను, కంప్యూటర్ నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. నాలుగువారాల పాటు నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో అన్ని విధాలుగా విజ్ఞానాన్ని, నైపుణ్యాలను అందించామన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ సిబ్బందికి అవసరమైన నైపుణ్యాలను శిక్షణలో అందించామన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగం అధ్యాపకులు డా. కె. శ్రీనివాసరావు, డా. బి. రెడ్డయ్య, హనుమంత్‌నాయక్, కృష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

4న కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : సెప్టెంబర్ 4న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతున్నట్లు సీపీఎం నగర కార్యదర్శి రామమోహన్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలో పేర్కొన్న హామీ ప్రకారం కడప ఉక్కు ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడంలో విఫలమైందన్నారు. వంట గ్యాస్‌ను వినియోగదారులు అందరికీ సిలిండర్ ధర రూ. 500 ఇచ్చేలా నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ నాయకులు చంద్రారెడ్డి, ఓబులేసు, ఎంఆర్ నాయక్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో పుష్ప'గిరి' ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

వల్లూరు : పుష్పగిరి పుణ్య క్షేత్రంలో శ్రావణ మాస పూర్ణిమను పురస్కరించుకుని గురువారం గిరి ప్రదక్షిణ కార్యక్రమం జరిగింది. పలు గ్రామాల నుంచి ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో తరలి వచ్చిన భక్తులు పుష్పగిరి కొండకు కొబ్బరి కాయలు కొట్టి భక్తి శ్రద్ధలతో గిరి ప్రదక్షిణ చేశారు. అనంతరం శ్రీ లక్ష్మీచెన్న కేశవ, శ్రీ సంతాన మల్లేశ్వర స్వాములను దర్శించుకుని పూజలు చేశారు. పెన్నా నదిలో స్నానాలు ఆచరించారు. శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

'పుట్టపర్తి' గృహాన్ని స్మారక మందిరంగా మార్చాలి

కడప కల్చరల్ : మహాకవి పద్మశ్రీ పుట్టపర్తి నారాయణాచార్యుల నివాస గృహాన్ని స్మారక మందిరంగా ప్రభుత్వం ఏర్పాటు చేయాలని మహా కవయిత్రి మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ డాక్టర్ గానుగు పెంట హనుమంతరావు విజ్ఞప్తి చేశారు. గురువారం పుట్టపర్తి నారాయణాచార్యుల నివాసం వద్ద కొద్దిసేపు సభ్యులతో కలిసి మౌనం పాటించారు. శుక్రవారం ఆయన వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సరస్వతీపుత్రునిగా పేరుగాంచిన, 14 భాషలలో పండితులైన ఆయన స్మారకంగా ఈ భవనాన్ని సాహిత్యంతోపాటు ఇతర కళలకు నిలయంగా మారిస్తే ఆ మహా పండితునికి నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని పేర్కొన్నారు. ఆ వీధిలోనే ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆయన నివసించిన వీధికి పుట్టపర్తి నారాయణాచార్యుల వీధిగా నామకరణం చేయాలని విజ్ఞప్తి చేశారు.

శాశ్వత భూహక్కు కల్పించడం హర్షణీయం

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



రైతులకు శాశ్వత భూహక్కు పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : భూములు అనుభవంలో మాత్రమే ఉండి ఎలాంటి హక్కు పత్రాలు లేని రైతులకు సీఎం జగనన్న శాశ్వత భూ హక్కు–భూరక్ష పథకం ద్వార శాశ్వత భూహక్కు కల్పించడం హర్షణీయం అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని దేవరాజుపల్లెలో ఎంపీటీసీ చెన్నకేశవ రెడ్డి ఆధ్వర్యంలో 80 మంది రైతులకు 250 ఏకరాలకు సంబంధించిన శాశ్వత భూ హక్కు పత్రాలను ఎమ్మెల్యే రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది రైతులకు ఇలాంటి అవకాశం కల్పించిన జగనన్నకు ప్రతి రైతు తోడు ఉండాలన్నారు. ఎంత మంది సీఎంలు మారిన, ఎంత మంది పీఎంలు మారిన ఈ భూహక్కు పత్రాల జోలికి ఎవరూ వెళ్లలేదన్నారు. ఇది చాలా సాహసోపేతమైన నిర్ణయం అన్నారు. మిగిలిన రాష్ట్రాల్లో ఒక నియోజకవర్గానికి అంటే దాదాపు 2 లక్షల మందికి ఒక తహసీల్దార్, ఒక సర్వేయర్ మాత్రమే ఉంటారని, ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన మండల వ్యవస్థ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో ఒక మండలానికి ఒక తహసీల్దార్, ఒక సర్వేయర్ ఉండేవారన్నారు. అయితే సీఎం జగనన్న ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రతి 2 వేల జనాభాకు ఒక సర్వేయర్ ఉన్నాడని, దీని కారణంగా భూరీసర్వే చేసి రైతులకు శాశ్వత భూహక్కు పత్రాలు మంజూరు చేశామన్నారు. జగనన్న సీఎం కాక ముందు వరకు బ్రిటీష్ హయాంలో చేసిన సర్వేనే ఆధారంగా తీసుకునేవారన్నారు. ఈ 120 ఏళ్లలో ఎన్నో మార్పులు జరిగినప్పటికి ఆర్ఎస్ఆర్‌లో మాత్రం ముందున్న పేర్లే ఉండేవన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దేశంతో జగనన్న ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, ఇక నుంచి రైతులకు తమ భూముల పట్ల అన్ని హక్కులు లభిస్తాయన్నారు. వాటిని తనఖా పెట్టుకోవచ్చని, విక్రయించుకోవచ్చని, రుణాలు సైతం పొందవచ్చన్నారు. ఈ నిర్ణయంతో వేల మందికి ప్రయోజనం చేకూరుతుందని, ఇతరుల పొలాలు తీసుకునే వారికి ఈ నిర్ణయం మింగుడు పడదని విమర్శించారు.

ప్రతి రైతుకూ పరిహారం వచ్చేలా కృషి

కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఓఎస్‌డీ, మండల ఇన్‌చార్జిలు

వేముల : రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నల్లచెరువుపల్లె గ్రామ సమీపంలో ఓఎస్‌డీ అనిల్ కుమార్ రెడ్డి, మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బయపురెడ్డిలతో కలిసి ఎండిన వేరుశనగ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో నల్లచెరువుపల్లె, కొవ్వూరు, పాలూరు, తదితర గ్రామాల్లో వేలాది ఎకరాల్లో రైతులు వేరుశనగ పంటను సాగు చేసుకున్నారన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల ఈ ఏడాది 60 రోజులు వర్షం లేకపోవడంతో వేల ఎకరాల్లో పంట ఎండిపోయిందన్నారు. పంట నష్టానికి సంబంధించి అధికారులతో పంట నష్ట అంచనా వేస్తామన్నారు. ఇప్పటికి ఈ క్రాప్ నమోదు పూర్తి కావస్తోందన్నారు. ప్రతి రైతుకు పరిహారం వచ్చేలా కృషి చేస్తామని హా మీ ఇచ్చారు. పాదయాత్ర పేరుతో లోకేష్, సాగునీటి ప్రాజెక్టులపై యుద్ధభేరి చెప్పి చంద్రబాబు నాయుడు ఇక్కడకు రావడం.. ఆ పాదాల ప్రభావంతోనే వర్షాల్లేక..వేల ఎకరాల పంట ఎండిపోయిందని ప్రజలే చర్చించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటనారాయణ, భైరవేశ్వర దేవస్థానం చైర్మెన్ రామసిద్ధారెడ్డి, మాజీ జడ్పీటీసీ రాజారెడ్డి, సొసైటీ అధ్యక్షులు గంగిరెడ్డి, ఎంపీటీసీ నరసింహా రెడ్డి, వర్రా నారాయణ రెడ్డి, జేడీఏ నాగేశ్వర రావు, ఏడీఏ అశోక్ రెడ్డి, ఏఓ చెన్నారెడ్డి, హెచ్‌ఓ రాఘవేంద్రారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వైద్యసేవలను వినియోగించుకోవాలి



కడపలోని ప్రభుత్వ దంతవైద్య కళాశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి

కడప అర్బన్: కడపలోని ప్రభుత్వ దంత వైద్యకళాశాలలో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని పి.ఆర్ అండ్ ఆర్.డి, ఏ.పి ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి అన్నారు. గురువారం కడపలోని ప్రభుత్వ దంత వైద్య కళాశాలను ఆయన సందర్శించారు. ఓపీ విభాగంలోని రోగులకు అందిస్తున్న సేవలకు సంబంధించిన రికార్డులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ వైద్య కళాశాలతో పాటు, ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో అత్యాధునిక సౌకర్యాలతో పూర్తి స్థాయిలో డాక్టర్లు వైద్య సేవలను అందిస్తున్నారన్నారు. దంతాలు దెబ్బతిన్న వారు పూర్తిగా దంతాలు కట్టించుకునేందుకు ప్రభుత్వం ఉచితంగానే సేవలను అందిస్తోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని వైద్యకళాశాలలు, ఆసుపత్రుల్లో వైద్య సిబ్బందిని నియమించి అన్ని రకాల వైద్య సేవలను అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో ప్రజలు వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ దంతవైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోత్స్న, సిబ్బంది పాల్గొన్నారు.